క్లుప్తంగా

వెంకయ్యస్వామికి విశేష పూజలు



మనుబోలు: మండల పరిధిలోని బీసీ కాలనీ సమీపంలో గల వెంకయ్యస్వామి మందిరంలో విశేష పూజలను శనివారం నిర్వహించారు. పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలను అర్చకుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిపారు. అన్నప్రసాదాన్ని మధ్యాహ్నం అందజేశారు. ఉభయకర్తలుగా చెరుకుమూడి అంకయ్య, గురుప్రసన్న దంపతులు వ్యవహరించారు.

విడవలూరులో జాబ్ మేళా



పరిశీలిస్తున్న ఎంపీడీఓ

విడవలూరు : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ తిరుపతి, రేణిగుంట, తడ నుంచి వివిధ కంపెనీల హెచ్ఆర్‌లు విచ్చేసి మండలంలోని నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నగేష్‌కుమారి, స్థానిక నేతలు చెముకుల శ్రీనివాసులు, పాశం శ్రీహరిరెడ్డి, సత్యవోలు సత్యంరెడ్డి, చెముకుల కృష్ణచైతన్య పాల్గొన్నారు.

10న డయల్ యువర్ డీఎం

నెల్లూరు సిటీ : ఈనెల 10న మంగళవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం జరుగుతుంది. డిపో పరిధిలోని ప్రయాణికులు 99592 25641 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయవచ్చని అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎన్ఎంఆర్ సిబ్బందికి రెగ్యులర్ పోస్టింగ్

నెల్లూరు(బారకాసు) : నెల్లూరు నగరపాలక సంస్థలో టైమ్ స్కేల్ ఎన్ఎంఆర్‌లుగా విధులు నిర్వహిస్తున్న ఐదుగురు సిబ్బందికి రెగ్యులర్ పోస్టింగ్ హోదా కల్పిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ఉత్తర్వులను జారీ చేసింది. దీని ప్రకారం ఎన్ఎంసీలో విధులు నిర్వహిస్తున్న మహ్మద్ జంషీద్‌అహ్మద్, వేణుగోపాలరావు, సుధాకర్‌రెడ్డి, ఎం.అజంత, గౌస్‌బాషాలకు ఇంజినీరింగ్ విభాగంలో రెగ్యులర్ పోస్టింగ్‌లు ఇస్తూ కమిషనర్ సూర్యతేజ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఇరిగేషన్ ఉద్యోగ సంఘ ప్రతినిధుల ఎన్నిక

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : ఏపీఎన్జీఓ అసోసియేషన్ ఇరిగేషన్ సర్కిల్ యూనిట్‌లో ఖాళీ అయిన ప్రతినిధుల ఎన్నిక శనివారం జరిగింది. అసోసియేషన్ ఇరిగేషన్ సర్కిల్ యూనిట్ అధ్యక్షుడు విజయకుమార్ ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం ఇరిగేషన్ కార్యాలయ ప్రాంగణంలో జరిగింది. తొలుత మాజీ కార్యదర్శి గోపాల్‌ను సత్కరించారు. నూతన కార్యదర్శిగా పి.రామచంద్రయ్య, ట్రెజరర్‌గా ఎస్.సుబ్బరామయ్య, ఉపాధ్యక్షుడిగా కె.ప్రసాద్ (జేటీఓ), అసోసియేట్ ప్రెసిడెంట్‌గా వీవీ శివప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా ఎస్.విజయభారతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పి.రవికుమార్, రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు స్వర్ణలత, సర్కిల్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

10న ఐక్య సింహపురి క్రిస్మస్ మహోత్సవం

నెల్లూరు(బృందావనం) : ఈనెల 10న నగరంలోని వీఆర్సీ మైదానంలో 13వ ఐక్య సింహపురి క్రిస్మస్ మహోత్సవం-2024ను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు, కన్వీనర్ ఎం.బర్నబాస్ తెలిపారు. అందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లు, ఆహ్వాన పత్రికలను సంఘ నాయకులతో కలిసి శనివారం వీఆర్సీ మైదానంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బర్నబాస్ మాట్లాడుతూ అంతర్జాతీయ సువార్తికుడు బ్రదర్ అనిల్‌కుమార్ ముఖ్య ప్రసంగీకులుగా వ్యవహరించనున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 'జాయ్‌బెల్స్' బ్యాండ్ వారిచే లైవ్ వర్షిప్ నైట్ కేక్ కటింగ్, క్యాండిల్ సర్వీస్, క్రిస్మస్ ట్రీ ఇనాగిరేషన్, దైవ సందేశాలు తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సమావేశంలో క్రైస్తవ సంఘీయులు, పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు ఉరందూరు సురేంద్రబాబు, గడ్డం హనోక్, క్రాంతి, దాసు, రాఘవమోసెస్, ఎల్ఎం. విజయకుమార్, బాబు, జోనా, శ్యామ్, భాస్కర్, కిరణ్, నాని తదితరులు పాల్గొన్నారు.

చలికి గజగజ

- దుప్పట్ల పంపిణీ లేక విద్యార్థుల అవస్థ
- సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహాల్లో దుస్థితి

తోటపల్లిగూడూరు: సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహ విద్యార్థుల సంక్షేమమే లక్ష్యమంటూ ప్రగల్భాలు పలికే రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడంలేదు. ప్రస్తుత విద్యాసంవత్సరం ప్రారంభమై ఏడు నెలలవుతున్నా, విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేయలేదు. ఫలితంగా చలికి వణుకుతూ.. నిద్రలేని రాత్రుళ్లను విద్యార్థులు గడపాల్సిన దుస్థితి నెలకొంది.

ఇదీ తీరు..

కోవూరు ఏఎస్‌డబ్ల్యూఓ పరిధిలోని తోటపల్లి గూడూరు, ఇందుకూరుపేట, కోవూరు, మండలాల్లో తొమ్మిది సాంఘిక సంక్షేమ వసతిగృహాలున్నాయి. వీటిలో ఐదు బాలుర.. నాలుగు బాలికల వసతిగృహాలున్నాయి. ఇందులో పేద, మధ్య తరగతులు, ముఖ్యంగా ఎస్సీ సామాజికవర్గానికి చెందిన 580 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. వాస్తవానికి ఇక్కడ ఉండే విద్యార్థులకు ఏటా రెండు దుప్పట్లను ప్రభుత్వం పంపిణీ చేయాల్సి ఉంది. ఒక దుప్పటిని పరుచుకునేందుకు, మరో దాన్ని కప్పుకొనేందుకు విద్యార్థులు ఉపయోగిస్తారు. సాధారణంగా విద్యా సంవత్సర ప్రారంభంలోనే వీటిని అందజేయాల్సి ఉంది.



చిన్నచెరుకూరులోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతిగృహం

నిరంతరం.. నరకం



పాత దుప్పట్లతోనే సర్దుకొని నిద్రిస్తున్న విద్యార్థులు

ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి పక్కన పరుచుకునే దుప్పటినే ప్రభుత్వం పంపిణీ చేసింది. కప్పుకొనేందుకు వినియోగించే దాన్ని మాత్రం నేటికీ అందజేయలేదు. చలి కాలం ప్రారంభం కావడంతో వణుకుతూ.. మరోవైపు దోమల మోతతో విద్యార్థులు నిద్రలేని రాత్రుళ్లను గడపాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇబ్బందులు పడుతున్నాం



నిద్ర సమయంలో కప్పుకొనేందుకు సరైన దుప్పటి లేక ఇబ్బంది పడుతున్నాం. ఏటా పాఠశాలల ప్రారంభానికే ముందే దుప్పట్లను అందించేవారు. అయితే ప్రస్తుతం దీన్ని అందించలేదు. ఫలితంగా చలికి తట్టుకోలేకపోతున్నాం. – గోళ్ల రితీష్, ఏడో తరగతి, బాలుర వసతి గృహం, చిన్నచెరుకూరు

రాగానే అందిస్తాం

సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరంలో కార్పెట్లను అందజేశాం. కప్పుకొనే దుప్పట్లు ఇంకా రాలేదు. సరఫరా అయిన వెంటనే పంపిణీ చేస్తాం.

– నాగరాజు, ఏఎస్‌డబ్ల్యూఓ, కోవూరు డివిజన్

ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తాం



మాట్లాడుతున్న పట్టాభిరామిరెడ్డి

కొడవలూరు : గండవరం హైస్కూల్ విద్యార్థుల తాగునీటి అవసరాల నిమిత్తం సొంత నిధులతో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తానని పౌరసరఫరాల శాఖ రాష్ట్ర డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి తెలిపారు. ఆ పాఠశాలలో శనివారం నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు ఆయన హాజరై, మాట్లాడారు. విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా కృషి చేయాలన్నారు. అనంతరం నోటు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం జి.శ్రీనివాసరావు, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ టి.శిరీష, సర్పంచ్ రాజకుమారి, మహిళా పోలీస్ శిరీష, ఉపాధ్యాయులు జి.నాగభూషణం, కట్టా సురేష్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో తనిఖీ



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ కంట్రోల్ అధికారి డాక్టర్ ఖాదర్‌వలీ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టీబీ నిర్ధారణ పరీక్షల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వైద్యాధికారులు డాక్టర్ సయ్యద్ అహ్మద్‌బాబు, డాక్టర్ కె.అవంతి, ల్యాబ్ టెక్నీషియన్ యాసిన్ అహ్మద్ పాల్గొన్నారు.

నెల్లూరీయులకు అవార్డులు

నెల్లూరు(బృందావనం) : ఉభయ తెలుగు రాష్ట్రాల పరిధిలో నిర్వహించిన షార్ట్‌ఫిల్మ్ కాంపిటీషన్‌లో తాము తీసిన 'షీ' ద పవర్ షార్ట్‌ఫిల్మ్‌కు ఉత్తమ జ్యూరీ అవార్డు, బెస్ట్ మ్యూజిక్ డైరెక్టర్ అవార్డు లభించాయని దర్శకుడు కళాంజలి అనంత్ శనివారం తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన టైగర్ అవార్డ్స్ 2024లో తాను కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వహించిన 'షీ' షార్ట్‌ఫిల్మ్ ఉత్తమ జ్యూరీ అవార్డును పొందిందన్నారు. అలాగే బెస్ట్‌మ్యూజిక్ డైరెక్టర్ సురభి సంగీత సౌరభ్‌కు అవార్డు వచ్చిందన్నారు. ఈ షార్ట్ ఫిల్మ్‌లో రామచంద్రమూర్తి, దువ్వూరి బెనర్జీ, మౌనిక, ఉపేంద్ర, శివకుమార్, హజరత్ నటించగా కెమెరా మెన్‌గా క్రిస్టోఫర్ వ్యవహరించారని తెలిపారు.

లక్ష్యం దిశగా సాగాలి



కోవూరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కోవూరు : విద్యార్థులు లక్ష్యం దిశగా సాగేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కోవూరులోని జెడ్పీ బాలికల పాఠశాలలో శనివారం జరిగిన పేరెంట్స్- టీచర్స్ మీటింగ్‌కు ఆమె హాజరై, మాట్లాడారు. గత సంవత్సరంలో చెవిటి, మూగ అయిన సమీరా అనే విద్యార్థిని పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరచడం వెనుక ఆమె తల్లి హసీనా కృషిని అభినందించారు. నియోజకవర్గంలోని విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నెల్లూరు ఆర్డీఓ అనూష, సర్పంచ్‌లు విజయ, జెట్టి రాజగోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ శ్రీలత, ఎంపీపీ పార్వతి, ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి, తహసీల్దార్ నిత్యానందబాబా, ఎంఈఓ రహీమ్, హెచ్ఎం ఝాన్సీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

- కొడవలూరు : పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌ల వల్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య సత్సంబంధాలు మెరుగుపడుతాయని మండల ప్రత్యేకాధికారిని, జిల్లా వ్యవసాయాధికారి పి.సత్యవాణి అన్నారు. కొడవలూరు జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు శనివారం ఆమె హాజరై, మాట్లాడారు. విద్యార్థులతో ఉపాధ్యాయులు స్నేహ పూర్వకంగా ఉండాలన్నారు. తహసీల్దార్ కె.స్ఫూర్తి, ఎంపీడీఓ ఏపీ.సుబ్బారావు, ఎంఈఓ జి.వసంతకుమారి, హెచ్ఎం బి.రవీంద్రకుమార్, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ షాకిరా బేగం, ఉపాధ్యాయులు ఖాదర్‌బాషా, రేఖారాణి, శ్రీనివాసులురెడ్డి, సీఆర్ఎంటీ పెంచలరావు పాల్గొన్నారు.
- నాయుడుపాళెం ప్రాథమికోన్నత పాఠశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. స్థానిక నాయకులు మాగుంట సతీష్‌రెడ్డి, ఎం.రఘురామయ్య, హెచ్ఎం వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి అనూష, ఉపాధ్యాయుడు చక్రపాణి పాల్గొన్నారు.
- విడవలూరు : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్ మీట్ శనివారం జరిగింది. పలు పాఠశాలల్లో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ నగేష్‌కుమారి, ఎస్సై పి.నరేష్, పంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్, నోడల్ ఆఫీసర్ రమ్య పాల్గొన్నారు.
- ఇందుకూరుపేట : విద్యార్థుల చదువుపై ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులది ప్రధాన బాధ్యత అని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు అన్నారు. నరసాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఎంపీడీఓ నాగేంద్రబాబుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతంగా చదువుకోవాలని సూచించారు. ఎంఈఓ సునీల్‌కుమార్, ఎస్సై నాగార్జునరెడ్డి, హెచ్ఎం నాగేశ్వరరావు, సర్పంచ్ తాతా సురేంద్ర, బి.సురేంద్రనాయుడు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పీటీఎం

వెంకటాచలం: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌ను పండగ వాతావరణలో నిర్వహించారు. మండలంలోని సర్వేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హాజరయ్యారు.

- గొలగమూడి సమీపంలోని ప్రభుత్వ ఆశ్రమ గిరిజన బాలికల ఉన్నత పాఠశాలలో పలు పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ చేతుల మీదుగా అందజేశారు.
- తిక్కవరప్పాడు, ఇస్కపాళెం, నిడిగుంటపాళెం పాఠశాలల్లో కార్యక్రమాలను నిర్వహించారు.

ముత్తుకూరు: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌ను నిర్వహించారు. ముత్తుకూరు, బ్రహ్మదేవి, ఈపూరు వెంకన్నపాళెం, కృష్ణపట్నం, ఎమ్వీపాళెం, దమ్మాయపాళెం జెడ్పీ హైస్కూళ్లతో పాటు మొత్తం 71 పాఠశాలల్లో కార్యక్రమాన్ని జరిపారు. తల్లులకు రంగవల్లులు.. విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథులుగా స్పెషలాఫీసర్ శ్రీనివాసులు, సీఐ రవినాయక్, ఎంపీడీఓ నాగమణి, ఎంపీపీ గండవరం సుగుణ, ఎంఈఓ హేమసుందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు: మండలంలోని 103 పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని నిర్వహించారు. సమస్యలపై ఆయా పాఠశాలల హెడ్‌మాస్టర్లు, విద్యా కమిటీ చైర్మన్లు చర్చించారు. పొదలకూరులోని డీఎన్నార్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో సమావేశాన్ని నిర్వహించారు. ఇనుకుర్తి, మొగళ్లూరు, తాటిపర్తి, మహ్మదాపురం, విరువూరు, లింగంపల్లి ఎస్సీ కాలనీ ప్రాథమిక తదితర పాఠశాలల్లో రంగవల్లుల పోటీలను నిర్వహించారు. ఎంపీడీఓ నరసింహరావు, ఎంఈఓలు సురేఖ, శోభనాద్రి తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లిగూడూరు: కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకోగలమని ఎంఈఓ జయరామనాయుడు పేర్కొన్నారు. మండలంలోని సౌత్‌ఆములూరు ప్రాథమికోన్నత పాఠశాలలో పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌ను నిర్వహించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు పోటీలను నిర్వహించి విజేతులకు బహుమతులను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు అహ్మద్‌బాషా, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు చెరుకూరు శ్రీనివాసులునాయుడు, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ సువార్త, ఉపాధ్యాయులు వసంతలక్ష్మి, విద్యుల్లత తదితరులు పాల్గొన్నారు.

- కోడూరులోని అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. అత్యుత్తమ మార్కులు సాధిస్తున్న విద్యార్థులు.. క్రీడా ప్రతిభ చూపుతున్న వారికి బహుమతులను అందజేశారు. గురుకుల కళాశాలల జిల్లా కన్వీనర్ జయలక్ష్మి, ప్రిన్సిపల్ ఎస్తేరమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రంగమ్మ, చైర్‌పర్సన్ సుమతి, వైస్ చైర్‌పర్సన్ ఈదూరు తులసీ తదితరులు పాల్గొన్నారు.

మనుబోలు: పాఠశాల అభివృద్ధికి అన్ని విధాలా తోడ్పాటునందిస్తామని మాజీ సర్పంచ్, పాఠశాల కో ఆప్షన్ సభ్యుడు నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. అక్కంపేటలోని ఎన్నెస్సార్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అక్కంపేట హైస్కూల్‌కు వచ్చే విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత బస్సు సౌకర్యాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

- మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్సై శివరాకేష్ హాజరయ్యారు. అనంతరం ఆటల పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ప్రత్యేకాధికారి సుబ్బారెడ్డి, ఎంఈఓ రమేష్‌కుమార్, హెచ్ఎంలు డేవిడ్, వసంతకుమారి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా పల్లకిసేవ



పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో గల లక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో పల్లకిసేవను వేడుకగా శనివారం నిర్వహించారు. స్వామి, అమ్మవారు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు. అభిషేకాలు, పూజలు చేశారు.

తాటాకులదిన్నెలో సామూహిక సీమంతాలు



కొడవలూరు : మండలంలోని తాటాకులదిన్నె అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు శనివారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి మాట్లాడుతూ గర్భిణులు తీసుకోవాల్సిన ఆహారం, వెయ్యి రోజుల ఆరోగ్య పరిరక్షణ గురించి తెలియజేశారు. పౌష్టికాహార ఆవశ్యకత గురించి వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని తప్పక తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మస్తాన్‌వలీ, రామకృష్ణ, అంగన్‌వాడీ కార్యకర్త జి.అరుణ, ఎంఎల్‌హెచ్‌పీ జి.సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్న పరామర్శ



కోవూరు : కొడవలూరు మండలం కొత్త వంగల్లు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత వేముల బుర్రయ్య ఇటీవల మరణించారు. ఈ క్రమంలో వారి కుటుంబసభ్యులను మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు ఉన్నారు.

నీరు వెళ్లే దారేదీ?



సుబ్బారెడ్డినగర్ రోడ్డులో నిలిచిన మురుగు

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో నిర్మించిన మురుగు కాలువల్లో నీరు పారక రోడ్డుపై నిల్వ ఉంటోంది. సుబ్బారెడ్డినగర్ ప్రాంతంలో నిర్మించిన డ్రెయిన్‌ల వల్ల అక్కడి రోడ్లపై నిత్యం నీరు నిల్వ ఉంటోందని ఆ ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు వైపులా ఎత్తయిన డ్రెయిన్‌లు కట్టడం వల్ల చిన్నపాటి వర్షం వచ్చినా కనీసం పది రోజుల వరకు నీరు పోయే దారిలేక రోడ్డుపైనే ఉంటోంది. ఇకనైనా నగర పంచాయతీ అధికారులు ఇలాంటి కాలువల పట్ల ఇంజినీరింగ్ శాఖ వారిని అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉంది.

తీశారు.. వదిలేశారు..



గత వారంలో పూడిక తీసిన తరువాత కాలువ గట్లపైనే వేసిన మురుగు

- పూడిక తీసిన వారానికే కాలువలోకి వెళ్లిన మట్టి
- మురుగునీటి సమస్య మళ్లీ మొదటికి..

బుచ్చిరెడ్డిపాళెం : అధికారులు, పాలకుల నిర్లక్ష్యం వల్ల చేసే పనులు ప్రజలకు ఎందుకూ ఉపయోగపడడం లేదు. బుచ్చిరెడ్డిపాళెంలో మురుగు కాలువల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిని పరిష్కరించేందుకు గత వారం నాలుగు కాలువల్లో పూడిక తీయించారు. అయితే తీసిన పూడిక కాలువ గట్లపై వదిలి వేయడంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆ మట్టి మొత్తం తిరిగి కాలువలోకి వచ్చి పూడిపోయాయి.

రూ.4 లక్షలతో..

బుచ్చిరెడ్డిపాళెంలో బంగ్లా వెనుక నుంచి వస్తున్న ప్రధానమైన గుడపల్లి కాలువలో రూ.4.08 లక్షలతో గత వారం పూడికతీత పనులు చేశారు. అయితే తీసిన పూడిక మట్టిని కాలువ గట్టుపై వేసి వదిలేశారు. ఈ పనులు జరిగి పది రోజులు అయినప్పటికీ తీసిన మట్టిని తరలించకుండా అటు కాంట్రాక్టర్, ఇటు అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఫలితంగా ఇటీవల కురిసిన వర్షాలకు గట్టుమీద వేసిన మట్టి కరిగి తిరిగి కాలువలోకి చేరింది. దీనివల్ల రాబోయే వర్షాలకు నగర పంచాయతీ ప్రజలు మురుగు నీటి సమస్యతో ఇబ్బందులు పడక తప్పదు. దీనిపై ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



ఇటీవలి వర్షాలకు కాలువలోకి జారిన మట్టి